
సాక్షి
గుంటూరు
బుధవారం । 3 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,667 క్యూసెక్కులువదిలారు.



రేపటి నుంచి రోజ్ షో

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 4 నుంచి రోజ్ ఎగ్జిబిషన్, అగ్రి హార్టికల్చర్ షో నిర్వహించనున్నారు.



అపూర్వ నాట్యం

కూచిపూడి: అమెరికాకు చెందిన ప్రవాస భారతీయ కూచిపూడి నాట్యాచారిణి అపూర్వ చౌదరి ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలకు అపూర్వ స్పందన లభించింది.

న్యూస్‌రీల్

నేడు పరీక్ష పే చర్చ ప్రత్యేక డ్రైవ్

గుంటూరు ఎడ్యుకేషన్ : పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని మోదీ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చా కార్యక్రమానికి విద్యార్థులను నమోదు చేసేందుకై బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, డైట్ ప్రిన్సిపాల్, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులందరు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పరీక్ష పే చర్చా కార్యక్రమ నమోదుకు పూర్తి సమయాన్ని కేటాయించాలని ఆమె ఆదేశించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నమోదు చేయించడం అధికారుల విధుల్లో భాగమని, ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు 'చలో కలెక్టర్ కార్యాలయ ముట్టడి'కి అనుమతుల్లేవు

నగరంపాలెం: గుంటూరు జిల్లాలో బుధవారం అంగన్‌వాడీ మహిళలు తలపెట్టిన 'చలో కలెక్టర్ ఆఫీసు ముట్టడి'కి ఎటువంటి అనుమతుల్లేవని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈనెల 3న అంగన్‌వాడీ మహిళలు కలెక్టర్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం విదితమే. దీన్ని ఆసరాగా చేసుకుని, అసాంఘిక శక్తులు శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ముట్టడికి అనుమతుల్లేవని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో 30(పోలీస్ యాక్ట్) అమల్లో ఉందని పేర్కొన్నారు. పోలీస్ ఆదేశాలను ఎవరైనా విస్మరించినట్లైతే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన శ్రీరామకోటి మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్ర ఆవరణలో 97వ శ్రీరామకోటి మహోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుగంధ ద్రవ్యాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన అద్దాల మందిరంలో సీతారాముల పవళింపు సేవతో సుసంపన్నమైనాయి. పవళింపు సేవలో కె.మృణాళిని, మాధవికృష్ణ భక్తి రంజని నిర్వహించారు. శృంగేరి పీఠాధీశ్వరులు, జగత్ గురువులు భారతి తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి స్వామి వారి దివ్యాశీస్సులతో నిర్వహించగా, రామనామక్షేత్ర గౌరవాధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, ట్రస్టీస్ రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

యార్డుకు 49,585 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 49,585 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,139 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.20,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,200 నుంచి 23,200 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 33,363 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.3400, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

ఆరోగ్య భాగ్యం



వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న మంత్రి విడదల రజిని

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యం
- చిన్నపలకలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 ప్రారంభించిన మంత్రి

గుంటూరురూరల్: ప్రజల ఆరోగ్య రక్షణ కవచం లాంటిది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలంలోని చిన్నపలకలూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 ఉచిత వైద్యం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సీఈవో బాలాజీతో కలిసి మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. వైద్య శిబిరంలో కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గతంలో 45 రోజులు నిర్వహించారని రెండో విడత కార్యక్రమంలో భాగంగా నేడు ప్రారంభించటం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మెరుగైన చికిత్సలు అవసరమైన వారిని పెద్దాసుపత్రికి రిఫర్ చేయాలని తెలిపారు. డీఎంఈ నరసింహం, డీఎంహెచ్‌వో టి.శ్రావణ్ బాబు, ఆర్డీవో శ్రీకర్, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి, సర్పంచ్ ఎదురుపాక వెంకట్, ఎంపీడీవో ఆదినారాయణ, తహసీల్దార్ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నూనె ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా
నూరి ఫాతిమా



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా షేక్ నూరి ఫాతిమా నియమితులయ్యారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆమె బీటెక్ పూర్తి చేశారు. ఆమె తండ్రి ఎమ్మెల్యే ముస్తఫా 2014, 2019లో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. రెండేళ్లుగా ఫాతిమా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా కొంతకాలంగా ఆమె పనిచేస్తున్నారు. నిత్యం ప్రతి డివిజన్‌లో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రత్యేక కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నూరి ఫాతిమాను నియమించడంపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సంబరాలు

తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నూరి ఫాతిమాను పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయం వద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు.

అంగన్‌వాడీలు విధుల్లో చేరండి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: ప్రజలకు ఇబ్బందులు కల్పించకుండా అంగన్‌వాడీలు, సహాయకులు ఈ నెల 5వ తేదీ లోపు విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మంగళవారం కోరారు. గత నెల 12 నుంచి 11 డిమాండ్ల అమలు కోసం అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు, మంత్రులతోపాటు వివిధ స్థాయిలో చర్చలు జరిపిందన్నారు. కేవలం మంచి చేయాలనే సంకల్పంతోనే ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వచ్చిందని, ఈ విషయాన్ని పెద్ద మనస్సుతో అర్థం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలు సమాజంలో ఎంతో కీలకమన్నారు. వారి సేవలు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రతి అంశంలోనూ ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఇటీవల కొందరు అంగన్‌వాడీలు మాట్లాడిన అంశాలు కొంత బాధ కలిగించినా వారి ఆవేదనను పెద్ద మనస్సుతో అర్థం చేసుకున్నామన్నారు. అందరూ కలసి వస్తేనే సమాజం ముందుకు వెళుతుందని, ఈ విషయాన్ని పెద్ద మనస్సుతో ఆలోచించాలని తెలిపారు. అంగన్‌వాడీ హెల్పర్స్‌ను వర్కర్స్‌గా పదోన్నతి కల్పించేందుకు వయో పరిమితిని 45 నుంచి 50 ఏళ్లకు పెంచుతూ జీఓ నెంబర్ 44 జారీ చేశారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వయో పరిమితి 62 ఏళ్లుగా నిర్ణయించామన్నారు. సేవా ముగింపు ప్రయోజనం రూ.లక్షతోపాటు అదనంగా మరో రూ.40వేలు అందించేందుకు జీఓ తీసుకొచ్చామన్నారు. 2013 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు, సూపర్‌వైజర్లకు పదోన్నతులు కల్పించలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు రూ.11,500, మినీ అంగన్‌వాడీల జీతాలు రూ.7,000, హెల్పర్లకు రూ.7000 పెంచిందన్నారు. అద్దెలు, పరిపాలనా ఖర్చులు, ఏడబ్ల్యూసీ నిర్వహణ తదితర అవసరాల కోసం బడ్జెట్ నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు జీవిత బీమా కూడా వర్తింప చేస్తున్నామన్నారు. ప్రమాద బీమా రూ. 2 లక్షల వరకూ చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు అంగన్‌వాడీ, కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1313 కోట్లు అందించామన్నారు. నవరత్న పథకాలు కూడా వారికి వర్తింపజేస్తున్నామన్నారు. పై అంశాలతోపాటు ప్రభుత్వం మరిన్ని డిమాండ్లను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉందని చెప్పారు. ముందు సమ్మె విరమించి ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ కోరారు.

పిండమార్పిడి ప్రక్రియతో పెయ్యదూడ జననం

పల్నాడు జిల్లాలో ప్రప్రథమం



పెయ్యదూడతో పశుపోషకుడు కృష్ణ

క్రోసూరు: ఒంగోలు జాతికి చెందిన మేలు రకం పెయ్య దూడను పుట్టించడంలో గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పశువైద్యులు విజయం సాధించారు. డాక్టర్ మల్లయ్య వివరాలు వెల్లడించారు. స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి చేసి ఈ పెయ్య దూడను పుట్టించినట్లు తెలిపారు. ఏపీ పశు సంవర్ధకశాఖ లాంఫారం, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండమార్పిడి ప్రక్రియ ద్వారా పెయ్యదూడ పుట్టించినట్లు చెప్పారు. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామంలోని రైతు శ్రీరాంసెట్టి కృష్ణకు చెందిన నాటు ఆవు గర్భంలో మేలుజాతి ఒంగోలు జాతి పిండాన్ని గతేడాది మార్చి 1వ తేదీన ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డిసెంబర్ 30 తేదీన 2023న ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి పెయ్యదూడకు ఆవు జన్మనిచ్చిందన్నారు. అండం సేకరించడంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ, ఐవీఎఫ్, ఫలదీకరణ పిండాన్ని అభివృద్ధి చేయటంలో లాంఫారానికి చెందిన డాక్టర్ ఎన్ఆర్ శ్రీకాంత్ సేవలందించినట్లు వివరించారు. ఆవును ఎంపికచేసి పిండాన్ని గర్భంలో ప్రవేశపెట్టటానికి మండల పశువైద్యాధికారి డాక్టర్ మల్లయ్య సేవలందించారు. లాంఫారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకత్వంలో పిండమార్పిడి చేసినట్లు తెలిపారు.

జననీ.. దుర్గాభవానీ



దుర్గగుడికి విద్యుత్ దీపాలంకరణ



చల్లంగ చూడమ్మా.. నమస్కరిస్తున్న భవానీలు

- నేటి ఉదయం 6.30 గంటలకు భవానీ దీక్షల విరమణ ప్రారంభం
- తమిళనాడు నుంచి శక్తి మాతలు రాక
- 6, 7 తేదీల్లో లక్షన్నరకు పైగా భవానీలు విచ్చేస్తారని అంచనా
- 7న మహా పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణకు దుర్గామల్లేశ్వరస్వామి సన్నిధిలో సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు దీక్షల విరమణ జరగనున్నాయి. మంగళవారం భవానీల రాకతో దుర్గమ్మ నామస్మరణతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మార్మోగుతున్నాయి. దుర్గగుడిలో దుర్గమ్మ దర్శనం కోసం భవానీలకు 5 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువ నుంచి మూడు క్యూలైన్లు కొండపైకి ఏర్పాటు చేశారు. మార్గమధ్యంలో మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు క్యూలైన్లు ఆలయంలోకి చేరుకునే సరికి 5 లైన్లుగా మారతాయి. సర్వ దర్శనంలో రెండు, బంగారు వాకిలి, రూ. 300, రూ.100 క్యూలైన్ల ద్వారా భవానీలు అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక దర్శనం పూర్తైన తర్వాత సర్వ దర్శనం రెండు క్యూలైన్లు, రూ. 100 క్యూలైన్లను మల్లేశ్వరస్వామి ఆలయం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. రూ. 300 క్యూలైన్, బంగారు వాకిలి క్యూలైన్లను మహా మండపం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకుంటారు. ఆలయ పరిసరాల్లో మొత్తం 220కి పైగా సీసీ కెమెరాలను, దుర్గాఘాట్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. మహా మండపం ఎదుట ఏర్పాటు చేసిన హోమగుండాలోల అగ్ని ప్రతిష్టాపనతో ఉదయం 6.30 గంటలకు దీక్ష విరమణలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. సుమారు 5 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని దేవస్థాన అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల కోసం నాలుగు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. .

ఒక రోజు ముందుగా శక్తిమాతలు

ఏటా దీక్ష విరమణలకు ఒక రోజు ముందుగా తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున శక్తి మాతలు ఇంద్రకీలాద్రికి చేరుకుంటారు. ఈ ఏడాది కూడా మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి సన్నిధికి చేరుకుంటున్నారు.

అత్యంత కీలకంగా ఆరో తేదీ

దీక్ష విరమణల్లో నాలుగోరోజు అత్యంత కీలకంగా దేవస్థానం, పోలీసు, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. 6వ తేదీ సాయంత్రం నుంచి విజయవాడ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివస్తారు. వీరితో పాటు నగరానికి చెందిన సాధారణ భక్తులూ భవానీలతో గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. శనివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిరంతరం గిరి ప్రదక్షిణ జరుగుతూనే ఉంటుంది. రెండు రోజుల్లో లక్షన్నరమంది వస్తారని అధికారులు అంచనా. శనివారం రాత్రి 11 గంటల వరకు భవానీలను దర్శనానికి అనుమతించినా, ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శనానికి దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

మహా పూర్ణాహుతితో ముగింపు

భవానీ దీక్షల విరమణ 7వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి. ఆదివారం పెద్ద ఎత్తున భవానీలు వచ్చే అవకాశముంది.

వీఎంసీ సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): దుర్గగుడిలో ఈ నెల 3వ తేదీ నుంచి జరగబోయే భవాని దీక్షల విరమణకు వచ్చే భక్తులకు నగరపాలక సంస్థ ఏర్పాట్లన్నీ పూర్తి చేసిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో అధికారులతో ఆయన సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ భక్తుల కోసం హోల్డింగ్ ఏరియా, బస్టాండ్, కెనాల్ రోడ్, పున్నమి ఘాట్, భవాని ఘాట్, సీవీఆర్ ఫ్లై ఓవర్ కింద, ఇంద్రకీలాద్రి కొండకింద, కొండ పైన తదితర ప్రదేశాలలో తాత్కాలికంగా 200 మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఏర్పాటలను డీఐజీ విశాల్‌గున్ని మంగళవారం పరిశీలించారు.

100% ఉత్తీర్ణత లక్ష్యం

- టెన్త్ విద్యార్థుల కోసం 30 రోజుల ప్రణాళిక
- ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు బోధన
- ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు
- సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ
- ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి 11,612 మంది విద్యార్థులు



గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థినులు



గుంటూరు ఎడ్యుకేషన్: మార్చి 18 నుంచి జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా వారిని పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు 30 రోజుల కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతోంది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించడంతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఉపాధ్యాయులతోపాటు ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు విడుదల చేసింది.

అధిక మార్కుల సాధనకు విద్యాజ్యోతి

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల పరిధిలో 11,612 మంది టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించే ఉద్దేశంతో జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో జగనన్న విద్యాజ్యోతి పేరుతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 10వ తరగతి పాఠ్యాంశాల బోధనలో విశేష అనుభవం గడించిన ఉపాధ్యాయులతో అత్యుత్తమ మెటీరియల్ రూపొందించిన జెడ్పీ పాలకవర్గం రూ.77 లక్షల వ్యయంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 38,269 మంది విద్యార్థులకు పంపిణీ చేసింది.

30 రోజుల ప్రణాళిక


జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌తోపాటు 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను గుంటూరు జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి (డీసీఈబీ) పాఠశాలలకు పంపింది. దాని ప్రకారం స్లిప్ టెస్టులతోపాటు వారాంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో విద్యార్థులు సబ్జెక్టుల వారీగా సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకుని, ప్రతిభావంతులుగా ఉన్న విద్యార్థులను మరింతగా ప్రోత్సహించడంతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల బోధనను ఆయా పాఠశాలల హెచ్ఎంలు విధిగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. విద్యార్థి ఏ ఒక్క సబ్జెక్టుపైనా భయం, ఆందోళన కారణంగా మార్కులు సాధించలేని పరిస్థితులకు తావులేకుండా అన్ని సబ్జెక్టుల్లోనూ ప్రతిభ చూపి అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపే విధంగా డీసీఈబీ ద్వారా ముద్రించిన కార్యాచరణ ప్రణాళికలో పొందుపర్చారు.

టెన్త్‌లో తప్పిన రెండు వేల మందితో దరఖాస్తు

గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 61.5 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలు రాసిన 11,620 మంది విద్యార్థుల్లో 7,093 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ విధంగా గతేడాది పరీక్షల్లో తప్పిన వారిలో రెండు వేల మందితో మరలా టెన్త్ పబ్లిక్ పరీక్షలకు దరఖాస్తు చేయించాం. పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, హెచ్ఎంలు తగు చర్యలు తీసుకోవాలి. సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఉద్దేశం.

– పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి

జానపదంలో రారాజు కొసరాజు



'కొసరాజు సినీ సాహిత్య వ్యాసావళి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు సినీ సాహిత్యంలో జానపదంలో రారాజు కొసరాజు అని వక్తలు పేర్కొన్నారు. తన సాహిత్యంతో ఆనందాన్ని మాత్రమే కాకుండా చైతన్యవంతం చేసిన సినీ సాహితీవేత్త కొసరాజు అని తెలిపారు. మద్దుకూరి విజయ చంద్రహాస్ రచించిన 'కొసరాజు సినీసాహిత్య వ్యాసావళి' పుస్తకాన్ని మంగళవారం ఆయన తండ్రి విజయకుమార్ విజయవాడ పుస్తకమహోత్సవం ప్రాంగణంలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ మాట్లాడుతూ తన పాటల్లో శోకం, హాస్యం మిళితం చేయడం, సంభాషణాత్మక పాటలు కొసరాజు ప్రత్యేకత అన్నారు. కొసరాజు గేయాల విశిష్టతను, చారిత్రక నేపథ్యాన్నీ వివరించడంలో పుస్తక రచయిత చేసిన కృషి అభినందనీయమన్నారు. పల్లె ప్రజల్లోని అమాయకత్వాన్ని, చైతన్యాన్ని తన గేయాల్లో వాళ్ల భాషలోనే ప్రతిఫలించిన ఘనత కొసరాజు రాఘవయ్య చౌదరికే దక్కుతుందన్నారు. హాస్యపాత్రలకు పాటలు రాయడంతో కొసరాజుకు దక్కాల్సినంత సాహిత్య గౌరవం దక్కలేదని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షుడు సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం చేద్దాం

- సాగులో పెట్టుబడులు తగ్గిద్దాం
- జిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్‌ఎఫ్‌ఏ టి.సైదయ్య



దొడ్లేరు(క్రోసూరు): ప్రకృతి వ్యవసాయం చేయటం ద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్‌ఎఫ్‌ఏ టి.సైదయ్య తెలిపారు. మంగళవారం రైతు కందుల అరుణ వరిపొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదయ్య రైతు చేస్తున్న వ్యవసాయ విధానం గురించి వివరిస్తూ.. గత మూడు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించడంతో 13.100 కిలోలు దిగుబడి రావడం జరిగింది. 28 బస్తాలు ఎకరాకు దిగుబడి రావడం జరిగింది. ఆమె పెట్టుబడి కేవలం రూ.23,500 ఖర్చు చేసినట్లు చెప్పారు. గట్లపై కంది కూరగాయలు వేయడం ద్వారా రూ.1000 ఆదాయంతో పాటు ఇంటి అవసరాలకు అవసరమైన ఆరోగ్యకరమైన కూరగాయలు లభించాయన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం వలన రసాయన పురుగు మందులు, ఎరువులు, వాడే ఖర్చు తగ్గటంతో పాటు ఆరోగ్యకరమైన నాణ్యమైన ఆహారం లభిస్తుందన్నారు. అంతేకాకుండా భూమి సారవంతం అవుతుందని వివరించారు. భూమిలో నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందనీ, గట్లపై కూరగాయలు, దుంపజాతి, కందిమొక్కలు వేయడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తుంది అని చెప్పారు. ఈ విధానాలు ప్రతి ఒక్క రైతు అవలంబించాలని, దాని ద్వారా రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడవచ్చని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమానికి షేక్ హజ్రబీ, సావిత్రి, షేక్ షహనాజ్, రైతులు పాల్గొనడం జరిగింది.

పగలు మరమరాల విక్రయాలు..

- ఆపై మహిళ మెడలో గొలుసుల దొంగతనాలు
- ఆరు కేసుల్లో నిందితుడి అరెస్ట్
- 66 గ్రాముల బంగారం, మోటారు సైకిల్ స్వాధీనం
- వరుస చోరీలకు కళ్లెం వేసిన పట్టాభిపురం, సీసీఎస్ పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ బి.ఉమామహేశ్వర రెడ్డి, చిత్రంలో సీఐ, ఎస్‌ఐ

నగరంపాలెం: ఒంటరి మహిళల మెడల్లో బంగారు గొలుసులను తెంచుకెళ్లే ఒకరిని సీసీఎస్, పట్టాభిపురం పీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద 66 గ్రాముల బంగారు సొత్తు, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ (పీఎస్)లో మంగళవారం రాత్రి జరిగిన విలేకర్ల సమావేశంలో పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ బి.ఉమామహేశ్వర రెడ్డి కేసు వివరాలను సీఐ పి.వీరేంద్రబాబు, ఎస్‌ఐ ఏకనాథ్‌తో కలిసి వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న బంగారు గొలుసుల చోరీలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పట్టాభిపురం పీఎస్ సీఐ వీరేంద్రబాబు, సీసీఎస్ సీఐ షేక్.నిషార్ బాషా, ఎస్‌ఐలు ఏకనాథ్, వి.బాబురావు, కె.ఆరోగ్యరాజు, హెచ్‌సీ, పీసీలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, గాలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా చేసుకుని చోరీలకు పాల్పడే వ్యక్తిని గుర్తించారు. ఈక్రమంలో మంగళవారం గుజ్జనగుండ్ల పార్కు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామ వాసి షేక్.చిన్నమాబు సుభానిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆరు కేసుల్లో బంగారు గొలుసు చోరీలకు పాల్పడినట్లు నేరం రుజువుకావడంతో అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 66 గ్రాముల బంగారు సొత్తు, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరి కొంత రికవరీ చేయాల్సి ఉందన్నారు.

నంబర్ ప్లేట్ తొలగించి..

ఆరు కేసుల్లో నిందితుడైన చిన్నమాబు సుభాని పోలీసులకు చిక్కడం ఇదే మొదటి సారి. మరమరాలు విక్రయించే అతను జల్సాలకు అలవాటుపడ్డాడు. వచ్చే డబ్బులు సరిపోగా చోరీలు చేయడం ప్రారంభించాడు. తన మోటారు సైకిల్‌పై నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకుపోయేవాడు. చోరీలకు పాల్పడే ముందు మోటారు సైకిల్ నంబర్ ప్లేట్‌ను తొలగించేవాడు. దొంగతనం చేశాక బైక్‌కు నంబర్ ప్లేట్ బిగించుకుని స్వగ్రామంలో తిరగే వాడని దర్యాప్తులో గుర్తించారు. వరుస కేసులను చేధించిన సీఐలు పి.వీరేంద్రబాబు, షేక్.నిషార్ బాషా, ఎస్‌ఐలు పి.ఏకనాథ్, వి.బాబురావు, కె.ఆరోగ్యరాజు, సీసీఎస్ హెచ్‌సీ బి.రమేష్, కానిస్టేబుళ్లు బి.దేవభిక్షం, వి.శ్రీకాంత్, ఎం.అశోక్‌ను జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

6న సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పల్నాడు జట్టు ఎంపిక



కరపత్రాన్ని అందజేస్తున్న పి.కోటేశ్వరరావు, చంటి

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక జరుగుతుందని జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సెక్రటరీ పి. కోటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 6వ తేదీ ఎంపిక చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. దీనికోసం ఎంట్రీ ఫీజు రూ. 100లు ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఒంగోలులో 11, 12, 13 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఆవుల జనార్ధన్, పీఈటీ చంటి ఉన్నారు.

భవిష్యనిధి ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యనిధి (ఈపీఎఫ్) ఖాతాదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ తెలిపారు. కృష్ణనగర్‌లోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయులు, ఖాతాదారులతో ఆయన ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారానికై ఖాతాదారులు నేరుగా కార్యాలయానికి రావల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ-మెయిల్, ఎక్స్, కు-కు, వాట్సాప్ 94946 57469 వంటి ప్రచార సాధనాలు, గ్రీవెన్స్ సెల్ ద్వారా సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు ప్రతినెలా 15వ తేదీలోపు తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల వేతనాల నుంచి మినహాయించిన సొమ్ముతోపాటు తమ వాటా ధనాన్ని పీఎఫ్ కార్యాలయానికి జమ చేయాలన్నారు. దీనిలో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. చెల్లింపులు ఆలస్యమైతే 33 శాతం నుంచి వంద శాతం వరకు జరిమానా, 12 శాతం వడ్డీ వసూలు చేస్తామని, కొన్ని సందర్భాలలో శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు.

అసిస్టెంట్ కమిషనర్ జేఆర్ మాధవ శంకర్ మాట్లాడుతూ కనీసం 20 మంది సిబ్బంది పనిచేసే సంస్థలు పీఎఫ్ పరిధిలోకి వస్తాయని, నెలకు రూ. 15 వేలకు పైగా వేతనం పొందే కార్మికుడు, ఉద్యోగి బేసిక్, డీఏ మొత్తంపై యజమాని నుంచి వాటా పొందిన వారికి హయ్యర్ (అధిక) పెన్షన్ మార్గదర్శకాలు వర్తిస్తాయన్నారు. ఒకవేళ పెన్షనర్ అకాల మరణం చెందితే వారి జీవిత భాగస్వామికి జీవితాంతం కనీసం రూ.వెయ్యి రూపాయల పెన్షన్ లభిస్తుందని తెలిపారు. టెలికం జిల్లా సలహా కమిటీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో పత్రికల్లో పనిచేస్తున్న 58 ఏళ్లు నిండిన వారు సత్వరమే పెన్షన్ పొందటానికి పీఎఫ్ సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.శరత్‌చంద్ర, కందిమళ్ళ వెంకట్రావు, నాగార్జున, షేక్ రాజా తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం ఎలా చేశారు?

నుదురుపాడులో వివరాలు సేకరించిన క్లూస్ టీం




పరిశీలిస్తున్న క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, క్లూస్‌టీం సభ్యులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని గుంటూరు-నరసరావుపేట హైవే ప్రక్కనగల ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మందాల శివరామికోటిరెడ్డి, అరుణ దంపతులు వారి బంధువులకు అనారోగ్యానికి గురికావడంతో కొద్దిరోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. కాగా గతనెల 30న సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో సుమారు రూ. 7 లక్షల రూపాయలు విలువైన బంగారం, వెండి, నగదు దొంగలించారు. లైట్లు వెలుగుతూ, తలుపులు తీసి ఉండటాన్ని గమనించిన ఇంటిప్రక్కన వారు ఫోన్‌ద్వారా తెలియజేయడంతో ఊరి నుంచి వచ్చిన అరుణ, శివరామిరెడ్డిలు ఫిరంగిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, క్లూస్ టీం సభ్యులు వచ్చి ఇంటి పరిసరాలు, సీసీ ఫుటేజ్, దగ్గరలోని టవర్‌కు సంబంధించిన సమాచారం సేకరించారు. పూర్తివివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. వారివెంట ఎస్‌ఐ చల్లా కిషోర్, రైటర్ దాసు, సుబానిలు ఉన్నారు.

భారీగా నకిలీ-నిషేధిత సిగరెట్లు స్వాధీనం

విలువ రూ. 4.50 లక్షలకు పైమాటే!



పట్టుబడిన నకిలీ, నిషేధిత సిగిరెట్లు

నగరంపాలెం: గుంటూరు నగరంలో నకిలీ / నిషేధిత సిగరెట్లను విక్రయించే ఓ వ్యక్తిని విజిలెన్స్ అధికారులు పట్టుకుని, రూ.4.50 లక్షలు విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ / ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు నగర పరిధిలోని ఏలూరు బజార్ శ్రీబాలాజీ ట్రేడర్స్‌లో అక్రమంగా నకిలీ, నిషేధిత సిగరెట్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐటీసీ బ్రాండ్ మాదిరిగా నకిలీ సిగరెట్లు, అక్రమంగా తయారైన నిషేధిత ఇతర బ్రాండ్ సిగరెట్లను అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో నకిలీ గోల్డ్ ఫ్లాక్ లైట్ సిగిరెట్స్ 60 పాచెస్, నిషేధిత బ్రాండ్లైన పారిస్, గోల్డ్ స్టాగ్, ఎస్సే లైట్స్, ఎస్సే గోల్డ్, గోల్డ్ పౌడర్ సిగిరెట్స్ బహిర్గతమయ్యాయి. దుకాణ డీలర్ గుడిపాటి చంద్రశేఖర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు చేపట్టారు. తనిఖీలో విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, లాలాపేట పోలీసులు పాల్గొన్నారు.

బాండీలో పడి ఉత్తరప్రదేశ్ వాసి మృతి

యడ్లపాడు: సబ్బుల తయారీకి ఉపయోగించే లిక్విడ్‌లో ప్రమాదవశాత్తు వ్యక్తి పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వంకాయలపాడు గ్రామ శివారున సబ్బుల తయారీకి అవసరమైన ముడి సరుకు తయారు చేసే ముఖేష్ కుమార్‌కు చెందిన దినేష్ పరిశ్రమ ఉంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులు 9 మంది సుమారు దశాబ్ద కాలంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసే కార్మికుడు అనిల్ (38) గతనెల డిసెంబర్ 28వ తేదీన ఉదయం 10.30 గంటలకు సబ్బుల తయారీకు ఉపయోగించే ముడిపదార్థం మరుగుతున్న పెద్దబాండీలో పడటంతో ఒళ్లంతా తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు గమనించి అదేరోజు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా వెంకట సత్యనారాయణ



సత్యనారాయణకు నియామక పత్రం అందజేస్తున్న గాళ్ళ సుబ్రహ్మణ్యం

నెహ్రూనగర్: కాపులందరూ ఐక్యంగా ఉండి కాపు జాతి హక్కులను, ప్రయోజనాలను కాపాడుకోవడానికి పార్టీలకు అతీతంగా పనిచేయాలని కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం రాత్రి అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రంలో కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పోలిశెట్టి వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాపునాడు, గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షుడు మిర్యాల గోపి కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామ గ్రామాలలో కాపు సోదరులను చైతన్యపరిచి తమ హక్కుల సాధన కోసం నిరంతరం పనిచేయాలని ఆయన కాపునాడు కార్యవర్గానికి సూచించారు. ఈ సందర్భంగా కాపునాడు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పోలిశెట్టి వెంకట సత్యనారాయణ చేత ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపునాడు నాయకులు బొందలపాటి వెంకట్రావు, ఎర్ర గోపు నాగేశ్వరరావు, కందుల సైదయ్య, ఏపూరి రామారావు, తిరుమల శెట్టి రఘురాం, పోలిశెట్టి సాయిబాబు, మానూరి రమేష్ పాల్గొన్నారు.

రైతులను పూలు, పండ్ల సాగుకు ప్రోత్సహించాలి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట శివరామిరెడ్డి



కొల్లిపరలో ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట శివరామిరెడ్డి

కొల్లిపర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25లో మండలంలో 200 ఎకరాల హార్టీకల్చర్‌లో 18 రకాల పండ్ల తోటలు, పూలతోటలు సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట శివరామిరెడ్డి మండలస్థాయి అధికారులను, సిబ్బంది ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో వి.విజయలక్ష్మితో కలసి అత్తోట, కొల్లిపర గ్రామంలో హౌసింగ్ వర్క్స్, ఘన వ్యర్థ ప్రాసెసింగ్ కేంద్రాల వద్ద ఇనిస్టిట్యూషనల్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశువుల షెడ్లు కట్టించాలని, ప్రభుత్వం ఈ షెడ్డు నిర్మాణానికి రూ.1.80 వేలు అందిస్తుందని వివరించారు. భూమిలో నీటి శాతం పెరగడానికి రైతుల సాగు భూమిలో ఊత గుంతలు తీయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీఓ ఎ.లక్ష్మిపతి, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.రవి, డి.అజయ్, పీల్డ్ అసిస్టెంట్‌లు నాగరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దొంగ వేబిల్లులతో ఇసుక అమ్మకాలకు అడ్డుకట్ట

- ఐదు ఇసుక లారీలు స్వాధీనం
- కేసు నమోదు చేసిన యంత్రాంగం



ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొల్లిపర: మండల సమీపంలోని కృష్ణానది నుంచి సోమవారం రాత్రి దొంగ వే బిల్లులతో నాలుగు ఇసుక లారీలు, ఎటువంటి బిల్లులు లేకుండా ఒక ఇసుక లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ ఎ.వి. చలం, స్థానిక ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మట్లాడుతూ జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కె.సుప్రజ ఆదేశాల మేరకు కొల్లిపర మండలంలో ఎస్‌ఐ ఆర్.రవీంద్ర రెడ్డితో కలసి ఇసుక అక్రమ రవాణ పై దాడులు నిర్వహించగా 150 టన్నుల ఐదు ఇసుక లారీలను అదుపులోకి తీసుకుని సదరు లారీ యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులను నివేదిక అందించినట్లు తెలిపారు. దొంగ బిల్లులుపై, ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించటం నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు.

కారు ఢీకొని మహిళ మృతి

రాజుపాలెం: అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. దేవరంపాడు గ్రామానికి చెందిన పిల్లల సరస్వతి (61), గజేంద్ర హనుమంతరావు, రుసుము సాంబ్రాజ్యం, కుంభా అంజియ్యలు కొండమోడు నుంచి స్వగామమైన దేవరంపాడుకు ఆటోలో బయలుదేరారు. వీరి ఆటో దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. తీవ్రంగా దెబ్బలు తగిలిన సరస్వతిని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. గజేంద్ర హనుమంతరావుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎస్‌కె అమిరుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

ఆత్మరక్షణ విద్యలపై అవగాహన ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: బాలికలు ఆత్మరక్షణ విద్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ డీఎస్పీ బి. జగదీష్ సూచించారు. ఉజ్వల భారతీ మహిళా శక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ డీఎస్పీ జగదీష్ మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ రకాల నైపుణ్యాలను విద్యార్థినులు కలిగి ఉండాలని తెలిపారు. ఇతరులు తమ పట్ల ప్రవర్తిస్తున్న తీరును అర్థం చేసుకుని మెలగాలని సూచించారు. సెల్‌ఫోన్‌ల అధిక వినియోగం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. క్రమశిక్షణతో విద్యార్థి దశ ముగించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మరో అతిథి శ్రీసుబ్బరాయ నారాయణ కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయ గుప్తా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. క్రీడా స్ఫూర్తి అలవరుచుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా అధిగమించ వచ్చునని తెలిపారు.